# అమ్మ పాలతో ఐస్‌క్రీం

## మార్కెట్లో మరో సరుకు - 'బేబీ గాగా'

### మహిళలమీద మరోభారం

ఇ. ఎస్. బ్రహ్మచారి



అమ్మ పాల ఐస్‌క్రీమొచ్చింది. పేరు 'బేబీ గాగా'. లండన్ కొవెంట్ గార్డెన్‌లో ఐస్‌క్రీమిస్ట్స్ రెస్టారెంట్‌లో దీన్ని ఈఏడు ఫిబ్రవరి 25 నుంచీ అమ్ముతున్నారు. హాం షైర్ కి చెందిన 44 ఏళ్ళ మాట్ ఓ కానర్ దీని సృష్టికర్త. రెస్టారెంట్ ని 2009 లో పెట్టాడు.అమ్మ పాలతో ఐస్‌క్రీం తయారుచేసి సంచలనం కలిగించాడు. ఇది "మాతృత్వపు అద్భుతం" అంటూ, దాన్ని అందరికీ అందుబాటు లోకి తెచ్చానని తన్ను తాను ప్రశంసించుకున్నాడు. నూరేళ్ళుగా ఐస్‌క్రీముల్లో చెప్పుకోదగ్గ మార్పులేమీ రాలేదన్నాడు. తానిప్పుడు పెద్దమార్పు తెచ్చానని గొప్పలుపోతున్నాడు.

తల్లి పాలలో మెడగాస్కర్ వెనిలా కాయలూ (Venilla pods), నిమ్మకాయ తోలు కోరూ (lemon zest) కలిపి చిలుకుతారు. వెయిట్రెస్ మార్టినీ (కాక్ టైల్) గ్లాసులో తెచ్చి అందిస్తుంది. అందులో లిక్విడ్ నైట్రోజెన్‌ని సిరంజ్ ద్వారా వదులుతుంది. దాంతో ఐస్‌క్రీం చాలా చల్లబడుతుంది, ఎంతో మృదువవుతుంది. ఇక తినటమే తరువాయి.



వెయిట్రెస్ మార్టినీ

పాలకోసం మంస్‌నెట్ అనే తల్లుల ఫోరంలో ఆన్‌లైన్ ప్రకటన ఇచ్చాడు. ఇంటర్నెట్‌లో ప్రకటనచూచి లీడ్స్ కి చెందిన విక్టోరియా హైలీ అనే 35 ఏళ్ళ మహిళ 30 ఔన్సుల పాలు ఇచ్చింది. 10 ఔన్సుల ధర 25 డాలర్లు. ఆ ధరే హైలీని ప్రోత్సహించింది.

"నా ఆస్తి ఎక్స్ ట్రా డబ్బుకోసం అమ్ముకుంటే ఏం?" అని మెట్రో అనే ఇంగ్లీష్ పత్రికని అడిగింది. ఆస్తి అన్నదేగాని, ఎందుకు అమ్ముతుందో కూడా అప్పుడే చెప్పింది :"నామటుకు నాకు మాంద్యాన్ని తగ్గించేందుకు పనికొస్తుంది" అన్నది. అసలు విషయం ఇదే.డబ్బు అవసరం. మరొక 14 మంది సిద్ధమయ్యారు



విక్టోరియా హైలీ



వెయిట్రెస్ మార్టినీ

హైలీ రుచిచూచి భలేగా ఉందనీ, నోట్లో వేసుకుంటేనే కరిగి పోయిందనీ చెప్పింది. మురిసిపోయింది.

సెయింట్ లూయీకి చెందిన టాం డూలే అనే  ఫైర్ మాన్ ఒకాయన అచ్చు అలాగే : ఇవ్వాళే మొదటిసారి తిన్నాను. చాలాబాగుంది. నిజంగా నోట్లో వేసుకుంటేనే కరిగి పోతున్నది అని తెగ మెచ్చుకున్నాడు. మన పిల్లలకి బాగుంటే మనకీ బాగున్నట్లే అన్నాడు కానర్.

కొద్దిరోజుల్లోనే చాలా పాపులర్ అయింది. ఇంకేం ఎగిరి గెంతేశాడు.ఎందుకువెయ్యడూ? చేకూరే లాభాలు అంతటివి.

30 ఔన్సుల పాలు ( 890 మిల్లీ లీటర్లు ) 75 డాలర్లవుతాయి. 50 ఐస్ క్రీములవుతాయి. ఒక్కో ఐస్క్రీం ధర 14 పౌన్లు ( 25 డాలర్లు ). రూపాయల్లో అయితే వెయ్యికి పైమాటే. ఆ లెక్కన వాటిని అమ్మితే 1250 డాలర్లొస్తాయి. పాలఖర్చు పోగా మిగిలిన 1175 డాలర్లూ లాభమని కాదు. పాలతోపాటు ఇతర పదార్థాలుంటాయి. రెస్టారెంట్ ఖర్చులూ దానికి కలుస్తాయి. మెడికల్ టెస్టులకూ డబ్బవుతుంది. అయినా భారీ లాభాలు చేకూరతాయి. ఎంతటివాళ్ళనయినా ఆకర్షించగల లాభాలు అంటే అతిశయోక్తి కాదు. ఎంతొస్తుందోననే లెక్కల్లో తలమునకలై ఉండి ఉంటాడు.

ఇంతలో బ్రిటిష్ వాళ్ళిద్దరిచ్చిన ఫిర్యాదుతో వెస్ట్ మినిస్టర్ కౌన్సిల్ అమ్మకాలు నిలిపింది.మనుషులు తినడానికి పనికొస్తుందో లేదో చూడాలంది.

మరొక మనిషి శరీర ద్రవాలతో తయారయ్యే ఆహార పదార్థాలు వైరస్ ల వ్యాప్తికి దారితీయవచ్చు. ఈసందర్భంలో హెపటైటిస్ వైరస్. కౌన్సిల్ ఆఫీసర్లు దాన్నిఎత్తుకెళ్ళి ఫూడ్ స్టాండర్డ్స్ ఏజెన్సీకి పంపించారు. తగిన పరీక్షలు చేసి. చివరకి అది సురక్షితమైనదేనని ఏజెన్సీ తేల్చి చెప్పింది.

“అందులో హానిచేసే బాక్టీరియా గానీ, వైరస్ గానీ లేదనీ, లాబ్ నుంచి మాకు వచ్చింది. మాపరిశోధన ముగిసినట్లే” నని రిఛర్డ్ బ్లాక్ అనే ఫుడ్ సేటీ మేనేజర్ ప్రకటించాడు. కౌన్సిల్ నిరాటంకంగా అమ్ముకోవచ్చన్నది.

ఇకనేం, కానర్ కి అడ్డూ ఆపూ లేకుండా పోయింది. మరీ పైకెగిరి గెంతులేశాడు. ఇదీ ఆయనికి ఖర్చులేని పబ్లిసిటీ అయింది. మార్చ్ 10 నుంచీ మళ్ళీ దర్శనమిచ్చింది. దీన్నీ అవకాశంగా తీసుకున్నాడు కానర్.

కానర్ ఐస్ క్రీం ని మెడికల్ గా పరీక్షించామనీ, పాస్చరైజ్ చేశామనీ, రక్త దాతకి నేషనల్ హెల్త్ సర్వీస్  ఏఏ పరీక్షలు చేస్తుందో అవన్నీ చేశామనీ అన్నాడు. పాలు ఇచ్చిన  మహిళ రక్త దానానికి నమోదైన వ్యక్తి. ఆమెని మేము పరీక్షించాం, క్లినిక్ గూడా టెస్ట్ చేసింది. అలా వైరస్‌లు ఉండవచ్చన్న వాదనని తిప్పికొట్టాడు

మేము అన్ని పరీక్షలూ చేశామని తెలిసికూడా వెస్ట్ మినిస్టర్ కౌన్సిల్ అమ్మకాలు  అపివేసింది. ఐస్ క్రీముల్ని ఎత్తుకెళ్ళింది. మాప్రతిష్ట దెబ్బతిన్నది. కనక మేము న్యాయపరమైన చర్య గురించి యోచిస్తున్నాము.దీని వల్ల ప్రజలకి రిస్క్ ఉన్నది అని జనానికి చెప్పేముందు, పరీక్షలు పూర్తయి నిజం తెలిసే దాకా ఆగి ఉండాల్సింది.

"మాకు తెలిసినంతవరకూ అమ్మ పాల ఐస్ క్రీం అమ్మే వ్యాపారాన్ని నిషేధించే చట్టం ఏదీ లేదు." అన్నాడు కానర్. ఇది మరింత ప్రచారాన్ని తెస్తుంది.



బేబీ గాగా సృష్టికర్త ‘మాట్ ఓ కానర్’ - వెయిట్రెస్ మార్టినీ తో

విషయం అది కాదసలు. బిడ్డ తాగాల్సిన పాలు రుచికోసం తినే ఐస్క్రీముల్లో పొయవచ్చా? తల్లిపాల ప్రయోజనమలు ఏమిటి?

ఏ.ఓ.ఎల్ న్యూస్‌తో : “ఈఆలోచనకి కొందరు తలతిప్పుకుంటున్నారు. నిజానికిది ఒక తాత్విక ప్రశ్నను లేవనెత్తుతుంది: ప్రతి కొన్నినెలకొకసారి కృత్రిమ గర్భధారణ జరిపి హార్మోనులిచ్చిన ఆవులపాలు మేలైనవా లేక మనిషివి మేలైనవా?" అనేదే ఆప్రశ్న అన్నాడు . "అమ్మ పాలు ఆవుపాలకన్నా పలచన, తీయన” అన్నాడు.

కానర్ లేవనెత్తినలో ఆవుపాలకన్న మనిషి పాలు మేలయినవి. కృత్రిమ గర్భధారణకి హార్మోనులివ్వంగనక అని ఆయనే చెప్పాడు. ఇందులో ఆయన ఉన్నదనే తాత్విక విషయమేమీ లేదు.

తల్లిపాలు కానర్ అన్నట్లు మాతృత్వపు అద్భుతమే. సందేహం లేదు.

ఐస్‌క్రీం రుచికరంగా ఉంది అమ్మిన కానర్, పాలమ్మిన హైలీ అన్నారు. ఇతరులూ లొట్టలేస్తూ తిని ఉండవచ్చు.

లాబ్ పరిక్షల్లో వైరస్‌లు లేవని తేలి ఉండవచ్చు. ఆరోగ్యానికి హాని లేకపోవచ్చు.

వీళ్ళు చెప్పని విషయాలు- చాలాప్రధానమయినవి - ఉన్నాయి. అందరికీ తెలిసినవే. అయినా చెప్పరు. పట్టించుకోరు.

తల్లి బిడ్డకివ్వాల్సిన పాలు ఎందుకు అమ్ముతుంది? బిడ్డతాగంగా మిగిలినవా? లేక ఆమెకి బిడ్డమిద ప్రేమలేకా? పాలివ్వాలని లేకా? కాదు. డబ్బులేక.

ఆవిషయం హైలీ చెప్పింది. కానర్ కానీ, , కోర్టుకెక్కిన ‘లేడీ గాగా’ కానీ ఈఅంశాన్ని తాకి తలచలేదు. ఎందుకంటే వాళ్ళప్రయోజనాలు ఎవరివి వారివే. ప్రభుత్వం పెట్టుబడికి అమ్ముడోయింది.చట్టాలు లేవు.

పాలివ్వడం తల్లికీ బిడ్డకీ మేలుచేస్తుంది. ఒక అంశం పోషణ. రెండోది మానసికమైంది. మొదటి దానికి ప్రత్యామ్నాయలు ఉంటాయని కొందరంటారు. అయితే పాలిచ్చే తల్లీకీ తాగే బిడ్డకీ ఆసమయంలో ఏర్పడే మానసిక బంధం నిరుపమానమైంది. మరే ప్రత్యమ్నాయమూ లేనిది.చిన్నప్పడొచ్చే ఎన్నోవ్యాధుల్ని నిరోధించగలిగే శక్తినిచ్చే ఏంటీ బాడీస్ నుంచీ పోషక పదార్థాలవరకూ పాలలో లభిస్తాయి. ఆప్రయోజనాలు అన్నీ ఇన్నని చెప్పలేం. లెక్కకందని ప్రయోజనాలు బిడ్డకు దక్కుతాయి.ఇవి మరో విధంగా రావు. బిడ్డ ఆరోగ్యం మీద ఇంత ప్రభావం చూపే తల్లి చర్య మరొకటి లేదు. పాలిచ్చే టప్పడు తల్లిలో ఆగ్జిటాసిన్ అనే హార్మోన్ విడుదలవుతుంది. ఇది తృప్తిని కలిగిస్తుందనీ, ఆదుర్దాని తగ్గిస్తుందనీ, మనస్సుకి ప్రశాంతత చేకూరుస్తుందనీ శాస్త్రజ్ఞులు చెబుతారు.

బిడ్డకు తల్లిపాలనుమించిన ఆహారం లేదు. పిల్లలకి రెండో నెలనుంచీ ఆరోనెలదాకా రోజుకి అటూఇటుగా ఒక లీటర్ తల్లి పాలు తాగుతారు. ఆతర్వాత వాళ్ళు తగగలిగినన్ని ఉండవు. అయినా రెండేళ్ళదాక కాసినో కూసినో ఉన్నమటుకు తాపితే చాలామంచిదని శాస్త్రజ్ఞులు చెబుతారు. ఏఇతరపాలూ అమ్మపాలకు సాటిరావు. అనివార్య పరిస్తితుల్లోనే పాలబాంకుల్లో దొరికే ఇతరులతల్లుల పాలు పట్టాలి. ఇది చాలా ఖర్చుతో కూడిన విషయం.అమెరికాలో HMBANA లో పాలు ఔన్స్ 4 నుంచీ 6 డాలర్లదాకా ఉంటుంది. అది లాభం వేసుకోకుండా ఇస్తుంది.
క్రిస్టీన్ బార్టెల్స్ అనే 44 ఏళ్ళ అమెరికా మహిళ ఒక బిడ్డని దత్తు తీసుకున్నది. అతన్ని తల్లిపాలతో పెంచాలి అనుకుంది. మదర్స్ మిల్క్ బాంక్ నుంచి ఔన్స్ 3 డాలర్ల లెక్కన కొని పట్టింది. నెలకి 100 డాలర్లయ్యాయి. ఆటబొమ్మలకీ, దుస్తులకీ తగ్గించి పాల్కి ఖర్చు పట్టింది.అల 9 నెలలపాటు తల్లి పాలు తప్ప మరేమే ఇవ్వకుండా పెంచింది. మొత్తం ఖర్చు 25 వేల డాలర్లకు పైన్నే. అమెరికాలో నూటికి 25 మందికి సంవత్సరానికి మొత్తం ఆదాయమే 25 వేల డాలర్లుండదు. దీన్ని బట్టి ఆఖర్చు ఎంత భారీ స్థాయిదో ఊహించవచ్చు. అయినా అమె ఎందుకు పెట్టిందంటే ఆపాల వల్ల చేకూరే సత్ఫలితాలు అటువంటివి. అంతటివి.
బాంకుల్లో పాలని పాశ్చరైజ్ చేస్తారు. పాస్చరైజేషన్ చేస్తే ఏంటీ బాడీస్ చురుకుదనం కోల్పోతాయి.
తల్లి పాలు బిడ్డ హక్కు అనటం పరిపాటి. అది ఆచరణలో ఉన్నది కూడా. ఇక మంచి ధర పలుకుతున్నదనే ఉద్దేశంతో పేదరికాన్ని కొంతైనా తట్టుకోటానికి పాలు బిడ్డకి తగ్గించి అమ్ముకునే అవకాశాలున్నాయి. అలా అమ్మాల్సిందేనని కుటుంబం నుంచి వత్తిడి వచ్చినా అశ్చర్యపోనక్కరలేదు. పేదరికాన్ని కొంతైనా తట్టుకునేందుకు ఇతరుల బిడ్డలకి జన్మనిచ్చేందుకు సిద్ధపడ్డట్లే ఇందుకుకూడా.
ఇవి క్రమంగా కార్పొరేట్ సంస్థల చేతుల్లోపడి దేశ దేశాల్లో కీ వ్యాపిస్తాయి అనేందుకు సందేహమే ఉండక్కర్లేదు.
పాలు తీసే మెరుగైన పరికరాలు కనిపెడతారు. అమెరికాలో ఒక రీసెర్చ్ జరుగుతున్నది. మదర్స్ మిల్క్ ఐస్క్రీం కంపెనీ  పాలుసేకరించే కొత్త పరికరాన్ని తయారుచేసే పనిలో తలమునకలై ఉంది. దాన్ని లోపల ధరిస్తే చాలు వాళ్ళు పనులుచేసుకుంటున్నా, ఆడుకుంటున్నా ఏమీ ఇబ్బంది కలిగించకుండా పాలు వాటంతటవే పాక్ లోకొస్తూవుంటాయి. వాటిని బాటరీ సాయంతో 6 గంటలు సురక్షితంగా నిల్వ ఉంచవచ్చు.

అమెరికా ప్రఖ్యాత పాప్ సింగర్ 'లేడీ గాగా' తనపేరు పెట్టి తన పాపులారిటిని ఉపయోగించుకూంటున్నాడని అభ్యంతరం తెలిపింది. దాన్ని ఆపకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని కానర్‌కి లాయర్ చేత లేఖ

రాయించింది. అది ఆమె పేరు గాదనీ ప్రతి బిడ్డ నోటితో చేసే మొదటి శబ్దం 'గా గా 'అనీ, దాన్నే పేరుగా తీసుకున్నాననీ  అన్నాడు. అంతే గాని మరి దేనితోనూ ఆపేరుకు సంబంధం లేదు అని చెప్పాడు , జవాబు తయారు చేస్తూ." గాగా అనే పదాన్ని అమె ఎలా తనసొంతం అనగలదు? అనాదిగా పసిబిడ్డల నోటినుంచి వచ్చే మొదటి మాటల్లో ఇది ఒకటి, " అన్నాడు.

తన ట్రేడ్ మార్కుల్ని వాడుకుంటున్నారు అంది. తనని పోలి తనని అనుకరిస్తున్న ((impersonator) మార్టినా అనే ఆమె చేత అమ్మిస్తున్నారన్నది. ఆపార్లర్లో వేసుకునే ధగధగ మెరిసే దుస్తులు ఈమెకి సంబంధించినవి కావు అంటూ ఆమె వాదనని తోసిపుచ్చాడు.

చాలామందికి జుగుప్స కలిగిస్తున్నది అని కూడా ఆక్షేపించింది. గాగా అనేదాన్ని తొలగించకపోతే ట్రేడ్ మార్క్ భంగం కేసు వేస్తానని బెదిరించింది.లేడీ గాగా ట్రేడ్ మార్క్ కింద ఆ పేరూ, ఆమె దుస్తులూ ,పాదరక్షలూ, ఫాషన్ అంశాలూ, ఆడియో వీడియో రెకార్డింగులూ నమోదయి ఉన్నాయి.అయితే ఐస్ క్రీం లాంటి ఆహారపదార్థలు అందులో లేవు.కోర్టుకు కేసు ఒకవేళ వెళితే ఏమవుతుందో వేచి చూడాల్సిందే. మార్చ్ 4 న న్యాయపరమైన చర్యలు మొదలుపెట్టింది.



గాగా పేరు తొలగించమంటున్న పాప్ సింగర్ లేడీ గాగా

కానరేం బెదరలేదు. ఇది హాస్యాస్పదమైన చర్య అని వ్యాఖ్యానించాడు. కోర్టులో పోరాడి గెలిచి చూపిస్తా నన్నాడు." ప్రపంచం లోనే అత్యంత పెద్ద సూపర్ స్టార్ ప్రపంచంలో అత్యంత చిన్న ఐస్క్రీం పార్లర్ మీద ప్రతాపం చూపుతున్నది" అన్నాడు. . కానర్ ఓడితే దాని పేరు మారుతుంది. ఐస్ క్రీం మార్కెట్లో మరోపేరుతో స్వైరవిహారం  చేసేట్లు చేస్తాడు. ఆమె బెదిరించిందని కానర్ చెబుతున్నట్లు అతనిని దివాలా తీయించినా  మరొక పెట్టుబడిదారుడు దీన్ని కొనసాగిస్తాడు. అంతే. యజమాని మారితే మారచ్చు కాని ఐస్ క్రీం అమ్మకాలు ఆగవు.

అమెరికాలో ఇది బాగా పాపులర్ అవుతుందని కానర్ గట్టి నమ్మకంతో అన్నాడు. చైన్ షాపుల్లో మొదటగా దీన్ని పెట్టింది "హొూల్ ఫూడ్స్". వాల్ మార్ట్, కాస్ట్కో, క్రోజర్ లు అనుసరించాయి. మార్చ్ లో అమెరికా అంతటా గ్రోసరీ షాపుల్లో లభిస్తుంది.

పాలు తీసే పరికరాలున్నాయి.నిల్వచేయటమూ తేలికే. ఒకచోటనుంచీ మరొకచోటకి పాలు పంపే రవాణా సౌకర్యాలకీ కొరవలేదు. కనక ఈ పరిశ్రమ విశ్వమంత విస్తరిస్తుంది. రష్యా హెలికాప్టర్ స్టార్ హొటేల్ (కాలిఫోర్నియా) చేరుతుంది. సముద్రంలో నిర్మించిన లాడ్జిల్లో, క్లబ్బుల్లో మెరుస్తుంది.

అయితే పాలమ్ముకున్న తల్లుల బిడ్డలకి మాత్రం తగినంత అందక పోవచ్చు. కొల్లలుగా దొరకాల్సిన తల్లిపాలు పరుల పాలయి బిడ్డలకి అపురూపమవుతాయి. తాగినన్ని తాగి వదిలివేసే పిల్లలకి తాగటానికే దొరకక పోవచ్చు. పెద్దవాళ్ళ దబ్బుకి దక్కి, పసివాళ్ళకి చిక్కక చిక్కి పోయే పరిస్తితు లొస్తాయి. వ్యాపార ప్రకటనలు ఎడా పెడా చేసి ప్రచారం చేసుకుంటారు. అందుకు అనుగుణంగా ఫిబ్రవరి 16 న ఇచ్చిన ప్రకటనలో పాలు ఇచ్చే మహిళలు మీడియా ఇంటర్వ్యూలకు రావటానికి తప్పనిసరిగా ఒప్పుకోవాలి అనే షరతు పెట్టారు.

సియారా లియోన్ పశ్చిమ ఆఫ్రికాలోని ఒక పేద దేశం.జనాభా 54 లక్షలు. ప్రపంచంలో పసిబిడ్డలూ, పిల్లలూ ఎక్కువమంది చనిపోయే దేశాల్లో మొదటి స్తానం ఆదేశానిదే. ప్రతి 5 గురిలో ఒకరు అయిదేళ్ళొచ్చేదాకా బతకరు. పసిబిడ్డల మరణాల్లో అయిదోవంతు టెటనస్ వల్ల.  2008 లో ఆ వ్యాధికి టీకాల ప్రచారంలో సల్మాహేక్ అనే మెక్సికో తార వచ్చింది. 41 ఏళ్ళ నటి, నిర్మాత, దర్శకురాలు. హాలీవుడ్‌లో చాలా ప్రముఖురాలు. ఫ్రిదా సినిమాలో ఆమె నటనకి 2002 లోఉత్తమనటి గా నామినేషన్ పొందింది. తనకూతురు పుట్టిన రోజునే పుట్టిన నల్లజాతి పిల్లాడికి పాలిచ్చింది.  తల్లిపాలు బిడ్డకి మేలు అని చాటటానికి అపని చేసింది

ఆబిడ్డడు ఆకలిగొని ఉన్నాడు. ఆదేశంలో పిల్లలకి కొన్నినెలలపాటు మాత్రమే పాలిస్తారు. తర్వాత భర్తలు ఇవ్వనివ్వరు. అక్కడి డాక్టర్లు ఆమెతో కొన్ని ప్రాంతాల్లో అనాదిగా వసున్న సాంప్రదాయం (tradition) ఉందని చెప్పారు. ఏమంటే పాలిచ్చే స్త్రీలతో భర్తలు కూడకూడదు. పాలు ఆపేస్తారు కనక పిల్లలకి సరైన పోషణ లేదు.దాంతో పిల్లల మరణాలు  ఎక్కువ. అందుకని డాక్టర్లు 2 సంవత్సరాలపాటు పాలివ్వాలి అని సూచిస్తారు.అయితే వాళ్ళ ఆచారమూ, నమ్మకమూ అడ్డొస్తాయి. దీన్ని తొలగించే ఉద్దేశంతోనే అమె కెమేరాముందే ఆకలితో ఉన్న ఆపిల్లగానికి పాలిచ్చింది. అప్పటికి అమె తన ఏడదిపాపకి పాలిస్తూనే ఉంది.తన అమ్మమ్మ మెక్సికోలో ఎవరో తెలియని బిడ్డకి పాలిచ్చి కాపాడిందని చెప్పింది.



ఆ క్లిప్పింగ్ ఆమెకెంతో పేరు తెచ్చింది. సినిమాలో నటన ఎంత పేరు తెచ్చిందో అంతకన్న ఎక్కువపేరు మానవత్వంతో స్పందించి చేసిన ఈచర్య తెచ్చిపెట్టింది. గంటన్నర నిడివి ఉన్న సినిమాలకన్నా కొన్ని క్షణాలు మాత్రమే ఉన్న ఈ క్లిప్పింగ్ ఎక్కువ ఆదరణ పొందింది. ప్రతిష్ట తెచ్చిపెట్టింది. ఆస్కార్ ఎవార్డ్ కి ఇదేం తక్కువ కాదు.

తల్లి పాల ప్రాధాన్యత అది. అంతేకాని పిల్లల నోటికాడవి కొల్లగొట్టి లాభాల కోసం సంపన్నులకి పెట్టటం దుర్మార్గమైన చర్య. చట్టాలు లేవంటూ ప్రజాస్వామ్యం పేరుతో మార్కెట్ శక్తుల లాభరంధికి కొమ్ముగాయటం దోపిడీ ప్రభుత్వాల లక్షణం. దేశదేశాల పీడిత ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించదగ్గ విషయం. మూకుమ్మడిగా ఎదిరించి ప్రభుత్వాల మెడలు వంచి ఈఐస్క్రీం తయారీని అడ్డుకొని తల్లిపాలపై బిడ్డకున్న హక్కుని నిలబెట్టాల్సిన సమయం.

**వీడియోలు**

1) మెచ్చుకుంటున్న కష్టమర్లనీ, కానర్నీ, వెయిట్రెస్నీ చూపుతూ బేబీ గాగా గురించిన బీ.బీ.సి వీడియో కధనం

Ice Cream made from Human Breast Milk on sale in London
http://www.youtube.com/watch?v=1zT6oPeV6YQ

2) సల్మా హేక్ ఆఫ్రికా బాలుడికి పాలిస్తున్న దృశ్యం ఇక్కడ చూడవచ్చు

SALMA HAYEK Breast Feeds A Hungry African Child | Actress Act Of Love

http://www.youtube.com/watch?v=6htxMJ4cfQs



గాగా పేరు తొలగించమంటున్న పాప్ సింగర్ లేడీ గాగా